


మాన్ని నిర్విరామంగా కొనసాగించారు. అది పాద యాత్ర అయినా, సైకిల్ యాత్ర అయినా ఆపలేదు. ఉమ్మడి మహబూబ్‌నగర్ సాగునీరు, నల్లగొండ ఫ్లోరైడ్ సమస్య కోసం పాదయాత్రలు చేపట్టారు. రాజోలిబండ మళ్లింపు పథకం (ఆర్డీఎస్) ద్వారా ఉత్పన్నమైన సమస్యలపై ప్రజా చైతన్యాన్ని కూడగట్టేందుకు 2003 మే 20 నుంచి 25 వరకు మండుతున్న ఎండల్లో అలంపురం నుంచి గద్వాల వరకు ఐదు రోజులపాటు పాదయాత్ర చేశారు. ఇదే 2003లో ఏప్రిల్ 26, 27 తేదీల్లో తీవ్ర జ్వరంతోనే రెండ్రోజులపాటు సిద్దిపేట నుంచి వరంగల్ దాకా 100 కిలోమీటర్లు సైకిల్‌యాత్ర చేపట్టారు. ఓవైపు నాగార్జునసాగర్ ఎడమ కాలువ ఆయకట్టు రైతుల సాగునీటి కోసం, మరోవైపు గొంతు ఎండిన నల్లగొండ దూప తీర్చేందుకు 2003లో ఆగస్టు 25 నుంచి 30 వరకు ఆరు రోజులపాటు కోదాడ నుంచి హాలియా వరకు పాదయాత్ర చేశారు. ఇక కరీంనగర్ ఎంపీ అయినప్పటికీ 2006లో ఫ్లోరైడ్ రక్కసిని రూపుమాపడానికి చౌటుప్పల్, నారాయణపురం, కొత్తగూడెం, వావిళ్లపల్లి, అంతంపేట, మర్రిగూడెం, నాంపల్లి, చండూరు, కనగల్ మీదుగా నల్లగొండ వరకు పాదయాత్ర చేపట్టారు. మర్రిగూడెంలో బసచేశారు. జల సాధన సమితి నాయకుడు దుశ్చర్ల సత్యనారాయణ, ఫ్లోరోసిస్ విముక్తి పోరాట సమితి నాయకుడు కంచుకట్ల సుభాష్ తదితరులతో సుదీర్ఘంగా చర్చించారు. ఆ సమయంలోనే 'చూడు చూడు నల్లగొండ.. ఎద మీద ఫ్లోరైడ్ బండ' పాటను స్వయంగా కేసీఆరే రాశారు. ఫ్లోరైడ్ సమస్య పరిష్కారానికి విస్తృత కార్యాచరణకు నడుంకట్టారు.





### 45 రోజుల జలసాధన ఉద్యమం...

బీఆర్ఎస్ పుట్టుక నుంచే తెలంగాణ సమాజం తమ ఇంటిపార్టీగా గుండెలకు అద్దుకున్న అపూర్వ సందర్భాల్లో ప్రధానమైంది 45 రోజులపాటు (నవంబర్ 25, 2002 – జనవరి 6, 2003 వరకు) ఏకబిగిన సాగిన జలసాధన ఉద్యమం. మన్నూమిన్ను తెలంగాణ వైపు చూడక తప్పని కార్యాచరణకు కేసీఆర్ ఈ ఉద్యమం ద్వారా అంకురార్పణ చేశారు. సామూహిక నిరాహారదీక్షలు, విద్యా సంస్థల బంద్, రాస్తారోకోలు, మహిళాశక్తి ప్రదర్శన, దీపాల వెలిగింపు వంటి వినూత్న నిరసన కార్యక్రమాలను బీఆర్ఎస్ చేపట్టింది. తెలంగాణ రాష్ట్ర ఉద్యమ చరిత్రలో జలసాధన ఉద్యమానికి ప్రత్యేకత ఉన్నది.

### నేతన్నకు తోడుగా జోలెపట్టి భిక్షమెత్తి

కాంగ్రెస్, టీడీపీ ఏలుబడిలో ఛిద్రమైన తెలంగాణ జీవనచిత్రాన్ని చూసి కేసీఆర్ తల్లడిల్లారు. చేనేత కార్మికుల ఆకలిచావులను చూసి చలించిపోయారు. రైతన్నల ఆత్మహత్యలు నిత్యకృత్యంలా సాగుతున్నకాలానికి ఎదురువెళ్లి కర్షక లోకంలో ధైర్యం నింపారు. తలాపునే గోదావరి, కృష్ణమ్మలు పారుతున్నా చుక్కనీరులేక గొంతులెండుతున్న తెలంగాణ కష్టాన్ని చూసి కన్నీటిపర్యంతం అయ్యారు. ఉమ్మడి కరీంనగర్, నల్లగొండ జిల్లాల్లో నాటి నేతన్నలు ఒకవైపు పడుగు పేకలుగా అల్లుకుపోయి కొనసాగుతున్న ఆత్మహత్యల పరంపర .. మరోవైపు 'ఆత్మహత్యలు చేసుకోవద్దు' అని కలెక్టర్లు గోడల మీద రాతలు. తనువు చాలిస్తున్న నేతన్నలను సాదుకున్న పాపానపోని సమైక్య పాలకుల ప్రేక్షకపాత్ర. కండ్లుండీ చూడలేని తెలంగాణ ప్రజాప్రతినిధులు... సిరిసిల్ల, పోచంపల్లి ప్రాంతాల్లో నేత కార్మికుల ఆత్మహత్యల పరంపరకు తాళలేక కేసీఆర్ జోలెపట్టి (2002 మే 22, తదితర తేదీల్లో) విరాళాలు సేకరించారు. ఆత్మహత్య చేసుకున్న చేనేత కార్మికుల కుటుంబాలకు రూ. 50వేల చొప్పున ఆర్థిక సాయాన్ని అందజేశారు. ములుగులో బిడ్డపెండ్లి కోసం అప్పుతెచ్చిన సొమ్ము, బంగారం అగ్నిప్రమాదానికి గురై కాలిబూడిద కావడంతో కన్నీరుమున్నీరైన తండాకు అన్నీతానై కేసీఆర్ అండగా నిలిచారు. కల్పన అనే గిరిజన యువతి పెండ్లికి ఆర్థిక సాయం చేశారు. కల్యాణలక్ష్మి పథకానికి నేపథ్యం ఈ ఘట్టమే.

### ఉద్యమంలో యువ తరంగం

ఉడుకునెత్తురు ఉరకలు వేసే విద్యార్థి లోకాన్ని కేసీఆర్ పటుతరమైన వ్యూహం, ముందుచూపుతో తెలంగాణ పోరాటంలో దించారు. తెలంగాణ కోసం పల్లెలను, పట్ట